నిరుపయోగంగా అతిథిగృహం

- ఐదేళ్లుగా మూతబడిన భవనం
- నిర్వహణకు నిధులు లేక వదిలేసిన అధికారులు
- వినియోగంలోకి తీసుకురావాలని పలువురి డిమాండ్



కంపచెట్ల మధ్య నిరుపయోగంగా ఉన్న అతిథిగృహం

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో లక్షలు వెచ్చించి నిర్మించి అతిథిగృహం నిరుపయోగంగా మారింది. నిర్వహించడానికి నిధులు లేకపోవడంతో కంపచెట్ల నడుమ విషసర్పాలకు నిలయంగా మారింది. గతంలో మండల పర్యటనకు వచ్చే ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ఈ అతిథిగృహంలో కాసేపు విశ్రాంతి తీసుకునే వారు. ప్రస్తుతం భవనం అధ్వానంగా మారడంతో మండల పర్యటనకు వచ్చే ప్రజాప్రతినిధులకు, జిల్లా ఉన్నతాధికారులకు విశ్రాంతి కరువైంది.

2004లో నిర్మాణం..

ప్రభుత్వం మండల కేంద్రంలో విశ్రాంతి భవన నిర్మాణానికి 2004లో రూ.7లక్షలు మంజూరు చేసింది. అనంతరం ఆ నిధులతో భవనాన్ని పూర్తి చేసి అప్పటి జెడ్పీచైర్మన్ కీత లక్ష్మమ్మ, ఎమ్మెల్యే వి.పురుషోత్తమరెడ్డి ప్రారంభించి వినియోగంలోకి తెచ్చారు. అప్పటి నుంచి మండల పరిషత్ కార్యాలయం నిధులతో భవనాన్ని నిర్వహించే వారు. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో విశ్రాంతి భవనం నిర్వహణను పట్టించుకున్న వారే కరువయ్యారు. దీంతో 5సంవత్సరాల నుంచి విశ్రాంతి భవనం అధ్వానంగా మారింది. కనీసం వేసిన తాళం కూడా తీయని పరిస్థితి నెలకొంది. దీంతో భవనంలోని ఫర్నీచర్ దెబ్బతింటుంది. విశ్రాంతి భవనాన్ని పట్టించుకోకపోవడంతో భవనం చుట్టూ దట్టంగా కంపచెట్లు పెరిగి విషసర్పాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విశ్రాంతి భవనం నిర్వహణకు నిధులు మంజూరు చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విశ్రాంతి తీసుకోవడానికి అతిథిగృహాన్ని నిర్మించారు. కాని నిర్వహణకు నిధులు లేకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా విశ్రాంతి భవనానికి నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– ఎలిమినేటి మురళీకృష్ణ, ఆత్మకూరు(ఎం)

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



నిర్వహించడానికి నిధులు లేకపోవడంతోనే విశ్రాంతి భవనానికి తాళాలు తీయడం లేదు. దాతల సహాయంతో విశ్రాంతి భవనం పరిసరాలు శుభ్రపరిచి త్వరలో వినియోగంలోకి తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నాం. విశ్రాంతి భవనం నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– రాములునాయక్, ఎంపీడీఓ

ప్రతి ఎకరానికి నీరు అందించడమే ధ్యేయం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తదితరులు

యాదగిరిగుట్ట రూరల్ : ఆలేరు ప్రాంతంలోని ప్రతి ఎకరానికి నీరు అందించడమే తమ ధ్యేయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గోదావరి జలాలతో నిండి అలుగు పోస్తున్న యాదగిరిగుట్ట నల్లచెరువుకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మల్లన్న సాగర్ నుంచి వచ్చే గోదావరి నీళ్లతో నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపుతున్నామన్నారు. ఆలేరు ప్రాంతంలో కరువు లేకుండా చేయడమే తమ లక్ష్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం శ్రీలక్ష్మీనరసింహాస్వామి వారి ఆశీస్సులతో గోదావరి నీళ్లతో ఆలేరు పాదాలు కడగడం చాలా సంతోషమన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో ఇది సాధ్యమైందన్నారు. గొలుసుకట్టు ద్వారా ఇప్పటివరకు 70శాతం చెరువులు నిండాయని, మిగిలిన చెరువులను కూడా త్వరలోనే నింపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకలు సుధ, కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్‌యాదవ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, హేమేందర్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, ఆంజనేయులు, వరలక్ష్మి, జ్యోతి, కస్తూరి ఉన్నారు.

నిమ్మయ్యకు జాతీయ అవార్డు



నిమ్మయ్యకు అవార్డు అందజేస్తున్న కోదండరాం

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని చొల్లేరు గ్రామానికి చెందిన పీస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కె.నిమ్మయ్యకు పాన్ ఇండియా సొసైటీ ద్వారా జాతీయ అవార్డు లభించింది. 50సంవత్సరాలుగా ఆయన అనేక సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసి మహిళలు, రైతులను, చైతన్యవంతులుగా చేసినందుకు ఆయనకు అవార్డు వరించింది. సోమవారం హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం, గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యం తీసుకురావాలి

- జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



అడ్డగూడూరు : కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

అడ్డగూడూరు : కొనుగోలు కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని జిల్లా వ్యవసాయధికారి గోపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కేంద్రాలకు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికను సందర్శించి కోటమర్తి, చొల్లరామారం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఓ పాండురంగాచారి, ఏఈఓలు దయాకర్, సునీత, అక్షర రైతులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను తగులబెట్టొద్దు

మోత్కూరు : వరికోతల అనంతరం పొలంలోని వరికొయ్యలను తగులబెట్టొద్దని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. మండలంలోని పాటిమట్ల రైతు వేదికలో మంగళవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడారు. వరి కోతల అనంతరం వరి కొయ్యలు ఉన్న మడిలో నీరు పెట్టి ఎకరానికి 50కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్ వేయడంతో వరికొయ్యలు కుళ్లి పొలానికి బలాన్ని ఇవ్వడమే కాకుండా భూమిలో ఉండే లాభం చేకూర్చే సూక్ష్మ జీవుల వృద్ధి జరుగుతుందన్నారు. తద్వారా భూమిలో సేంద్రియ కార్బన్ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వర్ధేమాన్ కీర్తి, వ్యవసాయ విస్తరణ అధికారులు ముక్కెర్ల అశోక్, గోపినాథ్, వేణు, రైతులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : వరికోతల అనంతరం కొయ్యలను కాల్చొద్దని మండల వ్యవసాయాధికారిణి సుధారాణి మంగళవారం రైతులకు ఒక ప్రకటనలో సూచించారు. వరికొయ్యలను భూమిలో కలపడంతో అవి సేంద్రియ, కంపోస్టు ఎరువుగా మారి భూమి సారాన్ని పెంచుతుందన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



వలిగొండలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చౌటుప్పల్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



బొమ్మలరామారంలో..



రామన్నపేట : నివాళులర్పిస్తున్న నాయకులు



రాజాపేటలో..



భూదాన్‌పోచంపల్లిలో..



మోటకొండూర్‌లో..



రామన్నపేట : వెల్లంకిలో..



మోత్కూరులో ..



ఆత్మకూరు(ఎం) : ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం

రామన్నపేట : పుస్తక పఠనంతో ఏకాగ్రత, విజ్ఞానం పెరుగుతుందని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాహత్‌ఖానం అన్నారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పుస్తక పఠనంతో సాధించిన విజ్ఞానం ఎప్పటికీ గుర్తుంటుదన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్‌రావు, అధ్యాపకులు డాక్టర్ రాచమల్ల శ్రీను, కరుణాకర్, డాక్టర్ లక్ష్మీనీలిమ, డాక్టర్ రత్నమంజుల, డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, డాక్టర్ సునీత, డాక్టర్ వెంకటేశ్వర్లు, కిషన్, బ్రహ్మం, ఎం.రవీందర్, శ్రీదేవి, రాంబాబు, బసవయ్య పాల్గొన్నారు.

వర్ధంతి సభను విజయవంతం చేయాలి



గుండాల : మాట్లాడుతున్న గోద శ్రీరాములు

గుండాల : రామన్నపేట మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరిరెడ్డి వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గుర్రం యాదగిరిరెడ్డి రామన్నపేట నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పేదల కోసం, అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని కొనియాడారు. సుద్దాల గ్రామంలో ఈనెల 22న నిర్వహించే వర్ధంతి సభలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.హరిశ్చంద్ర, మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, నాయకులు సత్యనారాయణచారి, కొమురయ్య, జోసఫ్, వెంకటయ్య, ఆంద్రయ్య, స్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి పరామర్శ

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి తండ్రి అండెం కొండల్‌రెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని మంగళవారం గోద శ్రీరాములు పరామర్శించారు.

కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



యాదగిరిగుట్ట రూరల్ : సర్వే ఫారాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నవీన్‌కుమార్

యాదగిరిగుట్ట రూరల్ : సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మహబూబ్‌పేట, సైదాపురం, మాసాయిపేట, చొల్లేరు తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే ఆయన పరిశీలించారు. తప్పులు లేకుండా సర్వేను పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్ స్వరూప, కారోబార్ గాజుల భాస్కర్ తదితరులున్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి యజమాని నుంచి వివరాలను అడిగి సర్వే ఫారంలో నమోదు చేసుకున్నారు. ఈ సర్వేను ఎంపీడీఓ రాములునాయక్ పరిశీలించారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

చౌటుప్పల్ : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని దళిత సంఘం రాష్ట్ర నాయకుడు నాగారం అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన మాదిగల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 23న నల్లగొండలో నిర్వహిస్తున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి, నాయకులు పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్ : నల్లగొండ పట్టణంలో ఈనెల 23న నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి : పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ పట్టణ ఏఈ సాయికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

22నుంచి ఆత్మజ్ఞాన సదస్సు

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని శ్రీమార్కండేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు భక్త సమాజం అధ్యక్షుడు భారత పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

భువనగిరిటౌన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా గ్రంథాలయంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ సీఈఓ శోభారాణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ బండారు జయశ్రీ హాజరై మాట్లాడారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

భువనగిరిటౌన్ : పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు కడారు రమేష్‌బాబు, బొమ్మకంటి బాలరాజు, పి.శంకర్‌రెడ్డి, జిట్టా భాస్కరరెడ్డి, బాలేశ్వర్, బుగ్గయ్య, శకుంతల, జ్ఞానేశ్వర్, రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బేకరీలో ఎస్‌ఓటీ పోలీసుల తనిఖీ

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామ స్టేజీ వద్ద ఉన్న బెంగుళూరు అయ్యంగారి బేకరీలో మంగళవారం ఎస్‌ఓటీ పోలీసులు తనిఖీ చేశారు. తినుబండారాల తయారీలో కాలం చెల్లిన వస్తువులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

భువనగిరిలో ప్రజా విజయోత్సవ వేడుకలు

భువనగిరిటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తికావస్తున్న సందర్భంగా మంగళవారం పట్టణంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, జహంగీర్,బాలరాజు, కళాకారులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం సరికాదు

మోత్కూరు : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా వరంగల్ జిల్లాలో తాజా మాజీ సర్పంచ్‌లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని తాజా మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య మంగళవారం అన్నారు.

సంక్షిప్త సమాచారం

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

గుండాల : బడిలో నమోదైన బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని గుండాల కాంప్లెక్స్ హెచ్‌ఎం గంధం చంద్రకళ కోరారు. గుండాలలో పాఠశాలకు తరచుగా గైర్హాజర్ అవుతున్న విద్యార్థుల కోసం మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బడి మధ్యలో మానేసిన విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ దేవరబోయిన లింగయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అన్నెపర్తి మమత, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ

గుండాల : మండలంలోని సుద్దాల, గుండాల గ్రామాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయ అధికారిణి సుజాత మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు చేసిన రికార్డులను, ట్రక్‌షీట్లను పరిశీలించారు. అనంతరం గుండాల, సీతారాంపురం గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఏఈఓలు రామ్‌సింగ్, శ్వేత, షెట్టర్ ఇన్‌చార్జ్ మంగమ్మ, డీలర్లు ఉన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

భూదాన్‌పోచంపల్లి : ఇంటి నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేసి, కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మండలంలోని పిలాయిపల్లి గ్రామానికి చెందిన కూతాటి యాదగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మోత్కూరు : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులు దోహదపడతాయని ఎస్‌ఐ నాగరాజు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూఢ నమ్మకాలు లేని శాస్త్రీయ తెలంగాణ అను అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం ఎస్‌ఐ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా సొసైటీ చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, జనవిజ్ఞాన వేదిక మండల కోఆర్డినేటర్ అంజయ్య, భాస్కరాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు బిల్లులు చెల్లించాలి

భూదాన్‌పోచంపల్లి : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిల్లులు చెల్లించాలని ఈనెల 25న ఎంఈఓ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్మికులు వెంకటమ్మ, అంజమ్మ, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులు ఆర్థికంగా ఎదగాలి

వలిగొండ : ముదిరాజులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ దొంతరబోయిన కృపాసాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని వెలువర్తిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బతేపు రంగనాథ్, కొలువుల హరినాథ్, గుర్రాల రాములు, బతేపు శ్రీను, నిమ్మల సురేష్, శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి అనిల్ రూ.10వేల విలువ గల డిక్షనరీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాస్కర్, పూర్వ విద్యార్థులు రాణి, అనితారెడ్డి, లింగయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

వలిగొండ : ప్రభుత్వం ఎన్నికల సమయంలో గొల్ల కుర్మలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల కుర్మల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. గొర్రెల పంపిణీకి బదులు నగదు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో దయ్యాల నర్సింహ, మద్దెపురం రాజు, దేశబోయిన సూర్యనారాయణ, బుగ్గ చంద్రమౌళి, కొండె శ్రీశైలం, జక్కుల మచ్చగిరి, నర్సింహ, మల్లేష్, రాములు, లింగస్వామి, భిక్షపతి, స్వామి, సురేష్, ఐలయ్య, శ్రీశైలం, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపురంలోనే మెడికల్ కళాశాల నిర్మించాలి

యాదగిరిగుట్ట రూరల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన మెడికల్ కళాశాల మల్లాపురంలోనే నిర్మించాలని గ్రామ బీఆర్‌ఎస్ యువజన నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేషం, చంద్రశేఖర్, రమేష్, గోపి ఉన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

భువనగిరిటౌన్ : లగచర్ల గిరిజన రైతులు, యువకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి జైలు నుంచి వారిని విడుదల చేయాలని గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో గిరిజన సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌నాయక్, సామాజిక ఉద్యమ నాయకుడు బట్టు రామచందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, పీఎంసీ రాష్ట్ర కన్వీనర్ సుర్పంగా శివలింగం, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్తీక వనభోజనాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి : మండల కేంద్రంలో పోచంపల్లి పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరిచెట్టు, శివలింగానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రుద్ర పాండురంగశాస్త్రి, దోర్నాల కృష్ణపంతులు, మార్కండేయస్వామి దేవాలయ అధ్యక్షుడు సీత సత్యనారాయణ, చెరిపల్లి భాస్కర్, బొమ్మ పాండు, నరేందర్, కటకం నరహరి, ప్రసాద్, తుకారాం, దశరథ, వెంకటయ్య, తడక అంజనేయులు, కటకం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఊరేగింపు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

భువనగిరిటౌన్ : పట్టణంలోని హజరత్ సొంటే పీర్, రహమతుల్లా అలై దర్గా గంధం ఊరేగింపును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఊరేగింపు దర్గా ముతవల్లి ఇబ్రహీం బియాబాని ఇంటి నుంచి హైదరాబాద్ చౌరస్తా వద్ద ఉన్న దర్గాకు చేరుకుంది. అనంతరం దర్గాపై పూలచాదర్‌ను కప్పి ప్రార్థనలు చేశారు.

రేషన్ దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీకాంత్‌రెడ్డి

భువనగిరి : పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను ఆర్డీఓ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాల్లో ఉన్న బియ్యం వివరాల రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులు బియ్యం తీసుకపోయిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌ఐ సత్యనారాయణరెడ్డి, డీటీసీఎస్ నర్సింగ్‌రావు ఉన్నారు.

బకాయిలు విడుదల చేయాలని కళాశాలల బంద్



ఎంజీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మోత్కూరు : ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆర్టీఎఫ్ బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి నెలరోజులు గడిచినా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని శ్రీసంతోష్, సాయిరామ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు తరగతులు బహిష్కరించి బంద్ నిర్వహించారు. అనంతరం మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేసినట్లు పట్టణానికి చెందిన వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.సత్యంగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, కార్యదర్శి సైదారావు, యాజమాన్యాలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సభ్యులు

భువనగిరిటౌన్ : జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హనుమంతరావును, అదనపు కలెక్టర్ వీరారెడ్డిని మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సభ్యులు స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. కలిసిన వారిలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ నర్సింహారెడి, రాష్ట్ర ఎంసీ మెంబర్ మహేందర్ రెడ్డి, వైస్‌చైర్మన్ బాలాజీ, డైరెక్టర్లు ఉన్నారు.

వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడిగా బోదాసు చిన్నఈదయ్య

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని దంతూర్ గ్రామానికి చెందిన బోదాసు చిన్న ఈదయ్య తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. మంగళవారం యాదగిరిగుట్టలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు ఆయన తెలిపారు.